# సితార

జడ్జిమెంట్ పూర్తయింది.

జడ్జీగారు కుర్చీలోంచి లేచి ఛాంబర్‌లోకి వెళ్ళిపోయారు. సితార కళ్ళల్లో రెండు కన్నీటి బొట్లు నిలిచాయి. మెల్లిగా నడిచి, అతని ముందుకు వచ్చింది.

కోపమో! వెటకారమో! అర్థంకాని భావంతో ఆమెవైపు ఓ చూపు విసిరి చకచకా వెళ్ళిపోయాడతను.

''కంగ్రాట్స్ సితార!''... సితార చేయి అందుకుని ఊపేశాడు శ్రీకర్.

''థాంక్యూ.. థాంక్యూ వెరీమచ్..'' సితార మాట పూర్తి కాకుండానే చుట్టూ చేరారు రిపోర్టర్స్, కెమెరాలు క్లిక్.. క్లిక్ మంటున్నాయి.

''సితారగారూ! మీ భవిష్యత్ కార్యక్రమం ఏమిటి?'', ''సితారగారూ! మీరు మళ్ళీ మ్యారేజ్ చేసుకుంటారా?'' ''సితారగారూ! ఆల్‌రెడి మీరు మీ లైఫ్ కాంపేనియన్‌ని సెటిల్ చేసుకున్నారని విన్నాం – నిజమేనా?'' ఊపిరి సలపనివ్వకుండా సాగుతున్న ఆ ప్రశ్నల పరంపరను – ఆ ఫ్లాష్‌లను దాటుకుని బైటికెళ్ళడానికి అవకాశం లేక – వాళ్ళందరికి జవాబులు చెప్పలేకా నిస్సహాయంగా చూసింది సితార.

''అసలు మీరు, మీ వారు విడిపోవడానికి కారణం ఏమిటండి?''

''మిమ్మల్నింత వున్నత స్థితికి తీసుకొచ్చింది వర్మగారే అని విన్నాం –– అలాంటి వ్యక్తిని మీరెందుకు దూరం చేసుకున్నారు?''

''ప్లీజ్...'' చేతులు జోడించి అర్థింపుగా అన్నది.

''నా భవిష్యత్తు గురించి నేనింకా ఆలోచించలేదు. కొంచెం తప్పుకుని నన్ను వెళ్ళనిస్తారా?''

''మేడమ్! మీరు నటిగా కొనసాగుతారా? పెళ్ళి చేసుకుని –– సినిమాల నుంచి విరమిస్తారని విన్నాం––– నిజమేనా?''

''లేదు – నేను నటిగా కొనసాగుతాను..''

''మేడమ్ మీరు మొదట్నుంచి సంచలన తారగా వార్తలకెక్కి సంచలనాల మీద సంచనాలు సృష్టిస్తున్నారు. తాజాగా మీరు ప్రేమించి పెళ్లి చేసుకన్న భర్త నుంచి విడాకులు పొంది మరో వార్త సృష్టించారు. తరువాత ఏం చేయాలనుకుంటున్నారు?''

సితార అసహనంగా చూసింది. ఆమెకి తన అనుభవం ద్వారా బాగా తెలుసు. ఈ రిపోర్టర్స్‌తో జాగ్రత్తగా ఉండాలి. ఏ మాత్రం ఏమారి మాట్లాడినా పత్రికల్లో అవాకులు – చెవాకులు రాస్తారు. అసలే సంచలన తార అని పేరు పడిపోయింది. అందుకే కంఠం మృదువుగా మార్చి అన్నది.

''వీలైనంత త్వరలో ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తాను. అన్ని విషయాలు వివరంగా అప్పుడు మాట్లాడతాను. ఓ.కె. ప్లీజ్..''

'' ఓ.కె. ఎప్పుడు ఆరెంజ్ చేస్తారు?''

''త్వరలో అన్నాను. ప్లీజ్ లీవ్‌మీ'' వాళ్ళందరినీ దాటుకుని చకచకా బైటికి నడిచింది.

శ్రీకర్ అప్పటికే కారులో కూర్చుని ఆమె ఎక్కగానే స్టార్ట్ చేశాడు.

''ఛ... ఛ... ఈ పత్రిక వాళ్ళకు బొత్తిగా బుద్ధి లేదు. కొంచెం సేపు కూడానన్ను ప్రశాంతంగా వుండనివ్వరు'' విసుగ్గా అన్నది.

''వాళ్ళందర్నీ ఎంటర్‌టైన్ చేయుకు సితారా! కొంచెం సీరియస్‌గా వుండు. నువ్వు పొలైట్‌గా వుంటే వాళ్ళలాగే వెంటబడతారు. నువ్వు సుప్రసిద్ధ కథానాయికవి. నెంబర్‌వన్ తారగా వెలిగిపోతున్న నువ్వు ఏం చేస్తే అదే సంచలనవార్త. ప్రతి రోజూ పేపర్‌లో నీకు సంబంధించిన వార్త ఏదో ఒకటి వుంటే కాని ఆ పేపర్ సర్క్యులేషన్ వుండదు'' అన్నాడు శ్రీకర్.

''హూ...'' పేలవంగా. నవ్వింది సితార.

''నా జీవితం పత్రికల వాళ్ళకి వ్యాపారం. నా ప్రతి కన్నీటిబొట్టు ఒక్కొక్క అక్షరంగా మారి వార్తగా మారితే ఆ వార్తని ఆనందంగా చదువుకుంటారు ప్రజలు, ఏవిటీ జీవితం!''

''అందుకే పత్రికల వాళ్ళని దూరంగా వుంచాలి''

''లేదు శ్రీకర్.. ఓసారి ప్రజల్లోకి వచ్చాక ప్రైవేట్ లైఫ్ అంటూ ఉండదు

స్టార్స్‌కి. మా ప్రతి అడుగూ వీళ్ళు వాచ్ చేస్తూ వుంటారు. పొలైట్‌గా మాట్లాడకపోతే ఏదేదో రాస్తారు. గుప్పెట్లో ఏమీ లేకపోయినా... అది మూసివుంచితే ఆ గుప్పిట తెరిచి చూడాలన్న ఉబలాటం వుంటుంది. అది మానవ సహజం. అందుకే -- అందులో ఏమీ లేదని తెలియజేయడమే మంచిది. లేకపోతే ఆ ఖాళీ గుప్పెటనే అనేక రకాలుగా ఊహించి రాస్తారు.

శ్రీకర్ ఆమెవైపు చూశాడు. సితార మొహంలో లీలగా విషాదపు మబ్బుతెర కమ్ముకున్నట్లుగా వుంది.

''సితారా..!'' లాలనగా పిలిచాడు.

ఆ పిలుపులోని మార్దవానికీ, ఆర్ద్రతకి, అనురాగానికి చలించిన సితార అతనికి దగ్గరగా జరిగింది.

''నీ మొహంలో యింకెప్పుడూ నేనీ నీలినీడలు చూడకూడదు. యింతకాలం నుంచి నువ్వు మగత నిద్రలో వున్నావని... గడిచిపోయిందంతా ఓ పీడకల అనీ అనుకో... ఆ కలని మర్చిపోవడానికి ప్రయత్నించు... రేపట్నించే ఓ కొత్త జీవితం ప్రారంభించు – నేను అనుక్షణం నీకండగా వుంటాను–''

సితార గుండె తీగలు – ఓ తీయటి రాగం ఆలపించాయి. అనువణువూ-- ఆ రాగానికి పులకరించింది.

అవును – నిజమే – గడిచిందంతా ఓ పీడకల – తెలిసీ తెలియని వయసులో – వయసు వేడిలో ఆకర్షణ అనీ, ఆరాధన అని, – వ్యామోహాన్ని ప్రేమ అనీ నమ్మి – ఓ కిరాతకుడితో – బయల్దేరి – నా అన్నవాళ్ళందర్నీ వదిలి వచ్చేసింది. కట్టిన తాళి దగ్గర్నించీ అన్నీ అమ్మి ఆ అయోగ్యుడికి ఆరునెలలు అన్నంపెట్టి – అనురాగం పంచి – లాలించింది – అమ్ముకోడానికి ఇంకేమీ మిగలక బ్రతుకు తెరువుకోసం చిత్రసీమలో అడుగుపెట్టి – చిత్ర విచిత్రంగా ఎదిగింది – తన ఎదుగుదల –= అతనికి కంటగింపైంది – తను పొందుతున్న అభినందనలూ – సత్కారాలు – అతణ్ణి ఈర్షాగ్నిలో భగభగమండించాయి – అతని సహచర్యంలో ప్రత్యక్ష నరకం అనుభవించాక తెలిసింది. బ్రతుకంటే కష్టాలు – కన్నీళ్ళూ – శారీరక హింసలు కాదని – అది కూడా శ్రీకర్ పరిచయంతో. అందుకే – అందుకే – సహనం చచ్చిపోయి విడాకులు కోరింది.

''సితారా!.. దిగు'' కారు డోర్ తీసి, ఆమె భుజంపైన సున్నితంగా తట్టాడు శ్రీకర్.

ఉల్కిపడిన సితార – అతణ్ణి చూసి హాయిగా నవ్వింది. అతనందించిన చేయి అందుకుని వయ్యారంగా కారులోంచి దిగింది.

గుమ్మంలో ఎదురైన ఆయా చేతిలోంచి చిన్నారి కావ్యని రెండు చేతుల్తో అపురూపంగా అందుకుని శ్రీకర్ వైపు గర్వంగా చూసింది.

శ్రీకర్ చిరునవ్వుతో ఆమె భుజంపైన చేయి వేసి లోపలికి నడిపించాడు.

❀ ❀ ❀

''సితారా! నీకు ఈ ఏడాది ఉత్తమ నటిగా నంది అవార్డు ప్రకటించింది ప్రభుత్వం'' శ్రీకర్ సుడిగాలిగా వచ్చి చుట్టేశాడు సితారని.

అప్పుడే షూటింగ్ నుంచి వచ్చి మేకప్ తుడుచుకుంటోన్న సితార – ''అలా మీద పడకురా అబ్బాయి – దూరంగా ఉండి మాట్లాడలేవూ'' అన్నది.

యాభై ఏళ్ళస్త్రీ గెటప్‌లో వున్న ఆమెని చూసి పకపకా నవ్వాడు శ్రీకర్.

'' ఇంత అద్భుతమైన నటివి కాబట్టే రెండోసారి నంది అవార్డు దక్కించుకున్నావు. ఎనివే హార్టీ కంగ్రాట్స్'' ఆమె చెక్కిళ్ళను పెదాలతో సున్నితంగా స్పృశించాడు.

''థాంక్యూ..'' అతని గుండెలపైన తల ఆన్చి అంది.

''సితారా! బహుశా వచ్చే నెల అవార్డ్స్ ఫంక్షన్ జరగవచ్చు. ఈ లోపల మన మ్యారేజ్ అయిపోవాలి''.

''అవును... ఎంత త్వరగా మన పెళ్ళి అవుతుందా అని ఎదురు చూస్తున్నాను. నేనింకా క్షణం కూడా నిన్ను విడిచి వుండలేను.''

శ్రీకర్ నవ్వాడు. ''నేనూ ఉండలేకపోతున్నాను. నేను రేపు లండన్ వెళ్తున్నాను. రాగానే మనం ముందు గుళ్ళో పెళ్ళి చేసుకుందాం..''

''మళ్ళీ ఎప్పుడు వస్తావు?'' దిగులుగా అడిగింది.

''పది రోజుల్లో వస్తాను. బిజినెస్ పనిమీద కదా! త్వరగా పూర్తి చేసుకుంటాను. రాగానే మనం తిరుపతి వెళుతున్నాం. ఓ.కె.''

'' ఓ.కె. నీకోసం చకోర పక్షిలా ఎదురుచూస్తాను''

''నువ్వు ఎదురుచూసేలోగా నేవచ్చేస్తాను.

లలిత కళాతోరణం రంగురంగు బల్బులతో.. పూలదండలతో అలంకరణలతో కళకళ్ళాడిపోతోంది. అహూతులైన వి. ఐ.పిలతో అవార్డ్ అందుకోబోతున్న సినీతారలతో, అంతులేని జనవాహినితో క్రిక్కిరిసి పోయింది.

స్టేజీమీద వెలిగి పోతున్న విద్యుద్దీపాలకాంతిలో వంటిమీది నగలు ప్రసరిస్తున్న తళతళలతోకళ్ళల్లో ఆనంద కిరణాలు.. గుండెల్లో సంతోష తరంగాలు వెల్లివిరుస్తోంటే తన జీవితంలోకి మలయ మారుతంలా ప్రవేశించి మండే గుండెని సేదతీర్చిన కాబోయే జీవిత భాగస్వామి శ్రీకర్ ప్రక్కన ఠీవీగా కూర్చుంది, సితార. తోటి నటీనటులు...దర్శకులు నిర్మాతలు.... ప్రభుత్వాధికార్లు...మంత్రులు.. అందరి అభినందనల మధ్య ఉత్తమ నటిగా నంది అవార్డు అందుకుంది.ముఖ్యమంత్రి చేతుల మీదుగా...

కెమెరాలు క్లిక్... క్లిక్ మంటున్నాయి. ఫ్లాష్‌లు... అభిమానుల కోలాహలం...

కార్యక్రమంలో భాగంగా కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పూర్తయినాయి... విలేకరులు, అభిమానుల వెల్లువ నుంచి శ్రీకర్ చేయందుకుని బైటికి రావడానికి విశ్వప్రయత్నం చేస్తోంది సితార... ''మేడం మీరు ఎప్పుడు శుభవార్త చెప్తారా! అని ఎదురు చూస్తున్నారు. మా పాఠకులు...''

''వర్మగారు మళ్ళీ, మీతో రాజీ ప్రయత్నాలు చేస్తున్నారని విన్నాం నిజమేనా!''

''మీరు రిజిస్ట్రార్ ఆఫీసులో వివాహం చేసుకోబోతున్నారని విన్నాం... వివరాలు చెప్తారా?''

శ్రీకర్ కొంచెం కోపంగా అన్నాడు.. 'మీ ప్రశ్నలన్నింటికీ ఇదేనా సమయం... ఇంత హడావుడిలో.. ఈ రద్దీలో ఇలా ఇంటర్వ్యూ ప్రారంభించడం బాగాలేదు.

''నేను ప్రెస్ కాన్ఫరెన్స్ ఆరేంజ్ చేసి మీకన్ని విషయాలు చెప్తాను, ప్లీజ్ కొంచెం టైమిస్తారా?''

అర్థింపుగా అన్నది సితార.

''మీరింతకు ముందు కూడా ఇలాగే అన్నారు. కానీ అలాంటి వేం

చేయలేదు..''

''నాకు అవకాశం... సమయం కుదరలేదు. త్వరలో మిమ్మల్నందర్నీ ఇన్వైట్ చేస్తాను... ప్లీజ్...''

''శ్రీకర్ గారితో మీరు పంచుకోబోయే జీవితం గురించి పాఠకులు చాలా వూహాగానాలు చేస్తూ మాకు లెటర్స్ రాస్తున్నారు'.

''అది నా వ్యక్తిగత విషయం.... అందులో ఊహాగానాలు చేయాల్సిన అవసరం ఏం వుంది?'' కొంచెం విసురుగా ముందుకు నడిచింది.

శ్రీకర్ బలవంతంగా ఆమెని చేయిపట్టి లాక్కెళ్ళి కారులో కూర్చోబెట్టి స్టార్ట్ చేశాడు.

''ఛ... వీళ్ళంతా ఎక్కడికెళ్ళినా వదలరు నన్ను... ప్రశాంతంగా ఎక్కడా వుండనివ్వరు...'' చిరాగ్గా వుంది.

'' ఈ ప్రోగ్రాం అనుకోకుండా ముందే ఫిక్స్ అయింది. లేకపోతే మనం మ్యారేజ్ చేసుకుని వచ్చే వాళ్ళం... ఎనీవే... ఎల్లుండి మనం తిరుపతి బయల్దేరుతున్నాం.. ఈ విషయం నీకూ, నాకే తెలుసు.. కావ్యని మనతో తీసికెళ్దాం.. అక్కడికి వీళ్ళనెవ్వర్నీ.. రానివ్వద్దు''

''అంతకన్నా నాకేం కావాలి.. ఈ సినీ జీవితానికీ, ఈ విలేకరులకు.. ఈ ప్రశ్నల పరంపరకు కనీసం ఓ రెండ్రోజులైనా దూరంగా వుండచ్చు.''

''రెండ్రోజులు కాదు... వారం రోజులు – ఎల్లుండి అంటే బుధవారం బయల్దేరుతున్నాం... గురువారం దశమి.. మంచిరోజు.. గుళ్ళో దండలు మార్చుకుందాం... తరువాత తిరుపతిలో అన్నీ చూసి కాటేజీల్లో హాయిగా వుందాం. నిన్నెవరూ గుర్తు పట్టకుండా.. కళ్లకి గ్లాసెస్ పెట్టుకో''.

సితార నవ్వింది.. ' ఏవిటీ! నాఖర్మ – ఇంకా నయం.. ఓ నల్ల ముసుగు కొనుక్కోమనలేదు.

శ్రీకర్ కూడా నవ్వాడు

''తప్పదు మేడమ్..'' తరువాత కారు సితార ఇంటిముందు ఆగింది...

ఆ రాత్రి శ్రీకర్ ఆమెతో కలిసి డిన్నర్ చేసి పన్నెండింటికి తన ఇంటికెళ్ళిపోయాడు.

మర్నాడు పేపర్‌లో ''పెళ్ళికాకుండా భార్యభర్తలైన సితారా... శ్రీకర్..'' అని హెడ్డింగ్‌తో వచ్చిన వార్తచూసి స్థాణువులైనారు ఇద్దరూ..

నంది అవార్డు ఫంక్షన్ దగ్గర్నించి రాత్రి సితారతో డిన్నర్ చేసి ఇంటికి వెళ్ళిందాకా అన్ని పూసగుచ్చినట్లు రాశారు. కొన్ని చిలవలు, పలవలతో పాఠకులకోసం తయారు చేసిన మసాలా కూరలా వున్న ఆ వార్త చదివి కన్నీళ్ళు పెట్టుకుంది సితార.

'' ఎంత దారుణం! మన ఇంట్లో మనం ఫ్రీగా ఉండే అవకాశం అదృష్టం కూడాలేదా! ఇవి కూడా పేపర్‌లో రాయాలా?'' బాధగా అన్నది – శ్రీకర్‌తో.

''అసలు మొదట్నించి వీళ్లని దూరంగా వుంచి వుంటే ఈ రోజు ఇంత న్యూసెన్స్ ఉండేది కాదు. ఎనీవే – ఇకనుంచీ జాగ్రత్తగా వుండు.. విలేకరులతో వీలైనంత కఠినంగా వ్యవహరించు.'' అన్నాడు శ్రీకర్ ఆమెని ఓదారుస్తూ.

బుధవారం తెల్లవారుఝామునే కావ్యని తీసుకుని ఇద్దరూ కారులో తిరుపతికి ప్రయాణమైనారు.

మధ్య మధ్యలో చిన్ని చిన్ని కాఫీ స్టాల్స్ దగ్గర ఆపుతూ కాఫీ, టీలు, రొట్టెలు రోడ్డు ప్రక్కన, చెట్ల క్రింద సేవిస్తూ శ్రీకర్‌తో ఆనందంగా గడిపింది సితార. వాళ్ళు తిరుపతి చేరేటప్పటికి అర్ధరాత్రి అయ్యింది. శ్రీకర్ ముందే ఏర్పాటు చేసినట్టుగా... చక్కటి కాటేజ్ రెడీగా ఉంది.

కొంచెం సేపు రెస్ట్ తీసుకుని తెల్లవారుఝామున నాలుగింటికల్లా స్వామి దర్శనానికి బయలుదేరారు. శ్రీకర్ పలుకుబడి వలన.. అక్కడే స్వామి వారి విగ్రహం ముందు .. ఇద్దరూ దండలు మార్చుకున్నారు. సరిగ్గా పది నిముషాల్లో కార్యక్రమం పూర్తి చేసుకుని మామూలు కొత్త దంపతుల్లా ఆలయం బైటికి నడిచారు.

ఆర్భాటం లేకుండా... ఆటంకాలు లేకుండా జరిగిన ఆ కార్యక్రమం వాళ్ళిద్దరి మనసుల్ని సేదతీర్చింది. చేతుల్లో ప్రసాదంతో... మెళ్ళో దండలతో.. పట్టువస్త్రాలతోబైటికి నడిచిన ఆ వధూవరులను చుట్టేశారు విలేకరులు.

వాళ్లిద్దరూ నిశ్చేష్టులై చూస్తుండగానే ఫ్లాష్‌లు వెలగడం.. కెమెరాలు క్లిక్ మనడం... చకచకా జరిగిపోయింది.

''కంగ్రాచ్యులేషన్స్ సితారగారు – హేవ్ ఏ వండ్రఫుల్ మారెజ్ లైఫ్''

''కంగ్రాట్స్ మేడమ్ – అనుకున్నది సాధించారు.. మీరు తిరుపతిలో..

అది కూడా ఇంత రహస్యంగా ఎందుకు వివాహం చేసుకోవాలనుకున్నారో చెప్తారా?''

''శ్రీకర్‌గార్కి ఇంతకువముందే పెళ్లైందనీ.. వారి భార్యకి తెలియకుండా మీరిక్కడ ఆయనని రహస్యంగా వివాహం చేసుకున్నారని విన్నాం నిజమేనా!''

''ప్లీజ్ ఒక స్నాప్ తీయనీయండి - మీ ఇద్దరూ మరోసారి దండలు మార్చుకోరూ!''

సితారకి పిచ్చెక్కినట్టవసాగింది.

''వీళ్లకెలా తెలుసు? తనిక్కడకి వచ్చినట్లు! ఎంత రహస్యంగా ప్లాన్ చేసుకున్నా ఎవరందించివుంటారీ ఇన్‌ఫర్మేషన్?''

ఆమె గుండె రగులుతున్న అగ్నిపర్వతంలా అయింది. అవమానంతో, కోపంతో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''మేడమ్! ఎప్పుడూ సంచలనాలు సృష్టిస్తోన్న మీరు.. ఇంకేదన్నా సంచలన వార్త అందించబోతున్నారా..!''

''మీ వైవాహిక జీవితం గూర్చి తెలుసుకోవాలని మా పాఠకులు తహతహలాడుతున్నారు.''

సంచలన వార్త - ఆమె పెదాలు మౌనంగా ఉచ్చరించాయా పదాన్ని...

తన ఎదురుగా - దాదాపు తన మీద పడిపోతూ ఒకరినొకరు తోసుకుంటున్న వారిని, వారి చేతుల్లో వున్న షార్ట్ హ్యాండ్ బుక్స్‌నీ... పెన్సిల్స్‌ని.. పరిశీలనగా చూస్తోంది.

శ్రీకర్ వైపు చూసింది..

కోపంతో ఎర్రబడి వున్నాయి అతని నేత్రాలు..విలేకరుల భుజాలకి వేళ్ళాడుతున్న కెమెరాల మీద ఆమె దృష్టి పడింది.

ఎంతో ఉత్సుకతతో.. ఆసక్తితో ఆత్రుతగా ఆమె చెప్పబోయే విషయంపైన ఏకాగ్రతగా.. రాసుకోవడానికి సిద్ధంగా బుక్స్ పట్టుకున్న వారిని చూసిన ఆమె పెదాలపైన ఓ సన్నని దరహాసరేఖ మెరిసింది. తన ఎదురుగా నిల్చున్న విలేకరిని చూసింది. ఆమె కుడి చేయి ముందుకు సాచింది...

ఎడంచేత్తో అతని షర్ట్ కాలర్ పట్టుకుని లాగి, కుడి చేత్తో బలంగా కొట్టింది చెంప మీద...

''నా నుంచి మీకు సంచలన వార్త కావాలికదూ! రాసుకోండి.. ఇంతకన్నా సంచలన వార్త మరోటిలేదు.. రాదు.. నా వ్యక్తిగత జీవితం మీకువార్త - నాకు మనసు మమత లేవనుకున్నారా? నాకు ప్రైవసీ ఉండకూడదనుకున్నారా? నేను సినిమా తారనైనంత మాత్రాన నాకంటూ మిగుల్చుకోడానికి అనుభూతులు అక్కర్లేదనుకున్నారా? నేనెక్కడికెళ్ళితే అక్కడికి రావడం... నేను నడిచినా, తుమ్మినా.. దగ్గినా... నా భర్తతో కాపురం చేసినా.. విడాకులు తీసుకున్నా.. పిల్లల్ని కన్నా అన్నీ మీకు కావాలి. ఎందుకండీ.. మీ జీవితాలగురించీ .. మీకున్న అనుబంధాల గురించి ఇలాగే రాసుకుంటారా పత్రికల్లో... ఇంతకాలం మీకెంతో గౌరవం ఇచ్చాను.. మీ ప్రశ్నలన్నిటికీ సహనంతో సమాధానం చెప్పాను. కానీ నా సహనాన్ని చంపేశారు. నా మంచితనాన్ని - నా సంస్కారాన్ని అడుగడుగునా పరీక్షించారు. అందుకే అందుకే ఈ సంచలనం సృష్టించాను. విలేకరి మీద చేయిచేసుకున్న నంబర్‌వన్ తార అని హెడ్‌లైన్స్‌లో రాసుకోండి... మీ పత్రికలు హాట్‌కేక్స్‌లా అమ్ముడవుతాయి''

శ్రీకర్‌తోపాటుగా దిగ్భ్రాంతులై చూస్తోన్న విలేకరులు, భక్తజన సందోహం.. అభిమానులు అందర్నీ దాటుకుని విసురుగా ముందుకు నడిచింది సితార.

బిత్తరబోయిన శ్రీకర్ తేరుకుని పరుగులాంటి నడకతో ఆమెను అనుసరించాడు.

(డయానా వ్యక్తిగత జీవితం పట్ల ఆసక్తితో, ఆమెని వేటాడి, వెంటాడి.. మృత్యువు వడిలోకి విసిరేసిన విలేకరుల చర్యకు నిరసనగా)

విశాలాంధ్ర
తేది 14-9-97